కథానిక:

తండ్రీ - కొడుకులు

శ్రీ వెం॥ చా॥ శా.

తండ్రి

వెంకటదట్నుంచీ వ్యాపారమే వృత్తిగా పెట్టుకుని బోలెడు ఆస్తి సంపాయించాడు. వ్యాపారంలో కూడా అతనికి ముఖ్యం వడ్డీ వ్యాపారం. సంపాయించిన డబ్బును చిన్న చిన్న పరిశ్రమలలోనూ, చిన్న చిన్న బ్యాంకులు స్థాపించడానికి వినియోగించాడు. డబ్బు పెద జల్లడంతో ప్రతీదాంట్లోనూ నే వన్నానని అనిపించుకున్నాడు. ఊళ్లోకల్లా అందమైన మేడ అతనిది. అతని కింకేం కావాలి ఉదారపురుషుడు అని పేరు పొందాడు. స్థాపించబడిన కంపెనీ లన్నింటికీ (ఆ ప్రాంతాలలో) డైరక్టరుగానో, భాగస్తుడుగానో ఉండేవాడు.

ఒక్కొక్కప్పుడు ఏకాంతంగా ఉన్నపుడు కూచుని ఇంతడబ్బు నేను ఎలా సంపాయించగలిగాను? అని అనుకుంటూ ఉండేవాడు. ప్రారంభదశలో వేరుశెనక్కాయలు, పకోడీలు, గారెలు, తయారుచేసి విద్యార్థులకు అమ్మి జీవితం గడిపినరోజులు అతనికి జ్ఞాపకానికి వచ్చేవి అతనికి ఆశ్చర్యమూ దుఃఖమూ రెండూ వచ్చేవి. ఆతర్వాత జీవితంలోని నిచ్చెనమెట్లన్నీ ఎక్కి అంత ఉన్నతస్థితికి స్వయేంకృషివల్లనే రాగలిగానని గర్వపడుతూ ఉండేవాడు.

ఇంత డబ్బు ఉన్నప్పటికీ అతనికి ఒక్క దురలవాటు లేదు. ఆఖరుకు సిగిరెట్టయినా కాల్చడు. ఏంసిగిరెట్టు, ఎందుకు కాల్చాలి? డబ్బు తగలెయ్యడమేగా వృధాగా, అని తనలో తను తర్కించుకుండేవాడు.

బీదవాళ్లు అంటేసరి ఎవరికైనా సహాయం చేసేవాడు. ఆ ఊళ్లో అతనంటే ప్రతీవాడు చేయెత్తి దణ్ణంపెట్టేవాడే. మహారాజు అని అనిపించుకున్నాడు.

అతనికి వయసువచ్చి ముసలివాడు అయ్యేకొద్దీ, డబ్బుమీద ఆసక్తి ఇంకా ఎక్కువైంది కాని తగ్గలేదు. ఇంకా డబ్బు సంపాయించి ఏం చేద్దామనో? కాని అలాంటి చర్చలు మనకు అనవసరం

కొడుకులు

ఇక అతనికి కలిగిన నలుగురు కొడుకులూ నాలుగురత్నాలు. తండ్రిమాటకు ఒక్కడూ ఎదురు చెప్పి ఎరుగడు. కొడుకులు అడిగింది కాదనకుండా వాళ్లకోర్కెలు తీర్చేవాడు. గారాబంగా పెరిగినప్పటికి చదువులో ఏ ఒక్కడూ తీసిపోలేదు. పాపం నలుగురూ తండ్రికి సాయంగానే ఉంటూవచ్చారు. తండ్రిమనస్తత్వ మెలాటిదో కొడుకులదీ అంతే.

పుస్తకాలమీద బోలెడు డబ్బు ఖర్చుపెట్టారు కొడుకులు. మార్కెట్‌లోకి వచ్చిన ప్రతి క్రొత్తపుస్తకమూ కొనేవాళ్ళు. అందులోనూ పెద్దవాడికి పుస్తకాలంటే మరీపిచ్చి. ఎప్పుడూ చదువుతూనే ఉంటాడు. రెండోవాడికి అందమైన ఆడపిల్లలంటే ఇష్టం. ఎక్కడ మంచి బొమ్మలు కన్పించినా అన్నీ సేకరించి, ఒక్కడూ కూర్చుని ఈమెను పెళ్ళిచేసుకుంటే బావుంటుంది, ఆమెను చేసుకొంటే బావుంటుంది అని ఉవ్విళ్లూరుతూ ఉండేవాడు. ఒక్కొక్కపుడు తండ్రిదగ్గరకు వచ్చి 'నాన్నా ఈమెచూడూ ఎంత అందంగా ఉందో! దేవకన్యను జ్ఞప్తికి తెస్తున్నది కదూ? అనేవాడు. కొడుకుమాటలు విన్నతండ్రికి ఆనందం ఇంతా అంతా కాదు. మురిసిపోయేవాడు. అలాగే నాయనా నీవు కోరినపిల్లనే పెళ్లాడుదుగాని ఏమీ అభ్యంతరం చెప్పను. అనేవాడు.

మూడోకొడుకు మచ్చుకైనవాడు. తండ్రికి చాలముఖ్యుడు. డబ్బులెక్కలూ అవీ చూస్తూ ఉంటాడు. అతనికీ వ్యాపారం అంటే ఇష్టం తండ్రివలె. తండ్రికి అతనంటే పంచప్రాణాలు. ఈ వ్యాపారం బావుంటుంది, అది బావుంటుంది అని తండ్రికి సలహా లిస్తూఉంటాడు.

నాలుగోకొడుకులో ఓ విశిష్టత ఉంది. ఎవ్వరితోనూ ఎక్కువగా మాట్లాడడు. చూడగానే వేదాంతివలె కన్పిస్తాడు. మౌనం అతనికి ఇష్టం. ఇప్పుడూ భగవంతునిగురించి, సృష్టి అనీ, పారమార్థికం అనీ ఆలోచిస్తూ ఉంటాడు.

౨

నలుగురు కొడుకులూ పెద్దవాళ్లయినారు. జీవితంలో ప్రవేశించే ఈడు వచ్చింది. భవిష్యత్తు సంగతి వాళ్లూ ఏమీ ఆలోచించటంలేదు. తండ్రికి కొంచెం కష్టంగా తోచింది. తనవలెనే కొడుకులుగూడ సంపాయించాలని అతనికి ఆశ. తన కన్నా పెద్దవాళ్లు కాగలరు కొడుకులు అని అతని కోరిక. ఎన్నో కలలు కనేవాడు. కొడుకుల విషయం తల్చుకున్న పుడల్లా అతనికి నిద్రపట్టేది కాదు.

నలుగురి కొడుకులనూ వాళ్ల వాళ్ల వృత్తులలో ప్రవేశపెడ్దా మనుకున్నాడు. ప్రతిరోజూ కొడుకులను పిలిచి సలహా లిద్దామనే చివరకు కొడుకులకు ఇష్టమైనట్లే చేద్దాం, అంతా వాళ్లకే వదిలిపెడ్దాం అని నిశ్చయం చేసుకున్నాడు

ఒకరోజు సాయంకాలం సముద్రపు ఒడ్డుకు షికారుకెళ్లినపుడు తనతోకూడా కొడుకులను తీసుకువెళ్లాడు. అక్కడ మాటలసందర్భంలో "ఒరే అబ్బాయిలూ మీ భవిష్యత్తును గురించి ఏమైనా ఆలోచించారా? ఏం చేయదల్చుకున్నారు? అని అడిగాడు. "ఏం వృత్తిలో ప్రవేశిస్తారో నిశ్చయం చేసుకోండి మీ ఇష్టం వచ్చినట్లే నేనూ పోతాను. మొగమాటం పడకండి. జీవితంతోకూడిన పని ఇది. నదురూ బెదురూ లేకుండా చెప్పివెయ్యండి" అని అన్నాడు.

నలుగురు కొడుకులూ ఒకరిమొగం ఒకరు చూసుకున్నారు. పెద్దవాడి ముఖాన చిరునవ్వు తాండవిస్తోంది.

"నాన్నా..... " అన్నాడు పెద్దవాడు.

"ఊ " అని ముందుకు వచ్చాడు.

"నాన్నా నేను న్యాయశాస్త్రం చదువుకుని ప్లీడరై పోతాను. ప్లీడరువృత్తిలో బాగా సంపాయించగలననే ధైర్యం ఉంది. పైగా అదంటే నా కెంతో ఇష్టంకూడా. అది స్వతంత్రమైన జీవనం ఇంకొకరిక్రింద బానిసగా పని చేయక్కర్లేదు.. అదే నిశ్చయం చేసుకున్నాను." అని అన్నాడు.

"భేష్ " అన్నాడు తండ్రి.

రెండోవాడు ముందుకు వచ్చాడు. "నాన్నా వైద్యశాస్త్రం చదువుకుని నేను డాక్టర్ని అవుతాను. ఎంతమందినో రక్షించవచ్చును. ఎంతో ప్రజోపకారం చేయవచ్చును. ప్రపంచములో ప్రజోపకారునికి మించిన దేముంది? నాకు వైద్యమంటే ఎంతోఇష్టం. డబ్బేకాకుండా బోలెడు పేరు కూడా సంపాయించవచ్చును. అది తప్ప నేను మరోటి చేయను. అదే నా నిశ్చయం" అన్నాడు.

"శభాస్ " అన్నాడు తండ్రి.

మూడోవాడు ముందుకు వచ్చి తండ్రిముఖం వైపు చూశాడు..

"నాన్నా' మనిద్దరం ఒకటే. వ్యాపారం తప్ప మరోదానికి నా మనసు పోదు. వ్యాపారం చేసి నీవలె పెద్ద ధనికుణ్ణి అవుతాను. డబ్బు సంపాయించడానికి అంతకన్నా సులభమార్గమేది? అందులోనూ నీ సహాయంతో ముందుకు పోతాను. నాకు అంతకన్నా ఏం కావాలి? లక్షాధికారి అయింతర్వాత ఇక చేసే దేముంది? అదీగాక వ్యాపారం స్వతంత్ర జీవనం. ఒకడి క్రింద సేవకావృత్తి చేయ నవసరం లేదు. నిన్ను మనసులో ఉంచుకుని వ్యాపారం సాగిస్తాను. అదే నా నిశ్చయం..."అని ఘట్టిగా చెప్పాడు.

"రైట్" అన్నాడు తండ్రి.

నాలుగోవాడు నలుగురి ముఖాలు వింతగా చూస్తూ ఒక వికటాట్టహాసంచేసి సముద్రం వైపు చూస్తూ "మనది దొంగతనమోయ్...దొంగతనం ఎంత మంచి వృత్తి...మీ కేం తెలుసు? గజదొంగనై పోతాను. స్వతంత్రజీవనం" అన్నాడు.

"ఛీ...నా కడుపున చెడపుట్టావు......" అన్నాడు తండ్రి.

"ఇంత నీచపుబుద్ధి పుట్టిందేం నీకు?..." అని ముగ్గురు కొడుకులూ అన్నారు.

నాలుగోవాడు ఏమీ మాట్లాడలేదు. నా అభిప్రాయం మార్చుకోను అన్నట్లుగా ఇసకలో వ్రేళ్లు గుచ్చాడు. అతన్ని చూసి సముద్రం కూడా నవ్వింది.

"నేను మీకు అక్కరలేకపోతే ఇంట్లోంచి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నాను. నేను దొంగతనమే చేస్తాను. నాకు నే నడిగినంత డబ్బు ఇవ్వండి.. తక్షణం వెళ్లిపోతాను. "

నలుగురూ శిలాప్రతిమల్లా ఉండిపోయారు.

"మాట్లాడ రేం? ఏదో సమాధానం ఇవ్వండి... రేపే వెళ్లిపోతాను" అన్నాడు.

"వెళ్లిపో.. ఏ జైల్లోనో బాధలు పడ్తుంటే విని విచారిస్తాము, అంతే.. నీమీద నేను ఆశలు పెట్టుకోలేను. రేపే చెక్కు రాసిస్తాను" అన్నాడు తండ్రి...

సముద్రపు హోరు వెకిలిగా నవ్వింది.

* * *

—దాదాపు ఇరవై సంవత్సరాలయినప్పటి విషయం.

తండ్రి మనోవ్యథతో కుంగి కృశించి మంచమెక్కాడు. కంచుగంట కొట్టినట్లుగా దగ్గుతున్నాడు. మంచంచుట్టూ ముగ్గురు కొడుకులూ ముసలమ్మలవలె కూర్చున్నారు—పీక్కుపోయిన కళ్లతో.

ఆ వాతావరణంలో వెనకటి హుందా లేదు. ఇల్లంతా కళావిహీనంగా ఉంది.

"ఇల్లుకూడా అమ్ముకున్నతర్వాత ఇంక చేసే దేముందీ?" అని అంటున్నాడు పెద్ద కొడుకు.

"ఫర్నిచర్ అమ్మితే తీసుకుంటా నన్నాడు కంపెనీవాడు; వాడితో నిన్న మాట్లాడాను." అని అన్నాడు రెండోవాడు సమాధానంగా. మూడోకొడుకు ఎండిపోయిన పెదవులూ, రేగిన జుత్తూ, చినగిన చొక్కాతో బండి తోలే వాణ్ణి జ్ఞప్తికి తెస్తూ బీడీ కాలుస్తూ కూర్చున్నాడు.

"ఏంరా ఏదీ మాట్లాడ వేం?" అని అతన్ని గదమాయిస్తున్నారు.

"ఆత్మహత్యచేసుకుందామా వద్దా అని ఆలోచిస్తున్నాను" అని అన్నాడు. "ఆలోచించటం ఎందుకూ వెంటనే చేసుకోక? ఒకడు తగ్గినా తగ్గినట్టే"...అని మిగతా ఇద్దరూ. ఇదీ అప్పటి వాతావరణం.

మరి మన కందరకూ ఆశ్చర్యం వేయదూ?

"మిగతే ఈ విధంగా ఉండే, ఆ నాలుగోవాడు అసలు ఉన్నాడో ఊడేడో? ఎవరికి తెలుసు? బ్రతికి ఉంటే ఇన్నాళ్లకు తిరిగి రాకుండా ఉంటాడా?" అని మళ్లీ తండ్రిహీన స్వరం వినపడుతోంది.

"ఎప్పుడూ కాలం ఒక తీరుగా ఉంటుందా? వెన్నెలా చీకటీ.. ఇక చీకటి రోజులు..." అంటున్నాడు తండ్రి.

"ఇక వెన్నెల రానే రాదు..." అన్నాడు పెద్ద కొడుకు.

"చాల్లేవోయి నీ బోడికవిత్వం...అటు చూడు; నాన్నప్రాణం పోయేట్లు ఉన్నది.. మాట మరీ నీరసం అయిపోయింది...మళ్లీ డాక్టర్ని పిలిచి కొస్తే బావుండు."—అని రెండోవాడు.

"అసలు నీ ముఖం చూస్తే ఏ డాక్టరూ రాడు...నీవుకూడా కొన్నాళ్లు డాక్టరీ వెలగబెట్టావుగా? ఉండు; నేను వెళ్లివస్తాను - నిన్న వచ్చిన డాక్టరు మనకు అక్కర్లేదు..." అని పెద్దవాడు.

"మీ రిద్దరూ ఇలా తగాదా లాడుతూంటే నాకు ఆత్మహత్య తప్పక చేసుకోవా లనిపిస్తున్నది. నే నిక భరించలేను..." అని మూడోవాడు.

తండ్రి మళ్లీ దగ్గుతున్నాడు.

పెద్దవాడు లేచాడు, డాక్టర్ని పిలుచుకురావడానికి. తలుపు తీసి వాకిట్లోకి వెళ్లేటప్పటికి... ఒక కారు ఆగియున్నది కారులోంచి ఎవరో దిగుతున్నారు.

తన తండ్రికోసం ఎవరో వచ్చారని.. వారికి తగిన మర్యాదే చేయా లనీ హడావుడిగా లోపలకు వెళ్లి తండ్రితో చెప్పి తన తమ్ములతో గూడా చెప్పాడు--అన్ని ఏర్పాట్లూ చేయమని. "నే నీలోపల బజారు వెళ్లి ఏదన్నా తీసుకొస్తాను." అని అంటుండగానే కారులోంచి దిగిన అజానుబాహు సరాసరి లోపలికి వచ్చి అతనిబుజంమీద చేయి వేసి.. ముఖంలో ముఖం చూసుకుండేటప్పటికి...

"ఓర్‌.. మనవాడే. ఎంత ఆశ్చర్యం... ఎలా మారిపోయావు.. అసలు నిన్ను గుర్తించలేదు. ఇన్ని సంవత్సరాలకు కనపించినందుకు సంతోషం.. "అన్నాడు పెద్దవాడు.

తండ్రిదగ్గిరకు వచ్చి.. "ఏం నాన్నా, ఆరోగ్యం సరిగా లేదో? ఇల్లు అమ్మేసేశ టు... మొదట ఆ యింటికి వె[illegible] చెప్పారు. మనవాళ్లు ప్లీడరూ, డాక్టరూ కూడా అయికూడి, ఇంత పని జరిగిందా?"—అని అంటుండగానే తండ్రి అందుకుని—

"నాయనా.. అదంతా ఓ భారతం ఉంది. అన్ని రోజులూ మనవి కావు..ఈ ఇరవై సంవత్సరాలలో బోలెడు మార్పులు వచ్చినయి...అవన్నీ నిదానంగా చెప్తాను నీవు జైల్లో పడకుండా ఇన్నాళ్లూ కాలక్షేపం చేశావా?" అని పరామర్శించాడు.

"జైలేవిటి? నేను ఇప్పుడు ఓ పెద్ద జమీందార్ని.. కొన్నిలక్షలు మూల్గుతున్నయి...ఒక ఫ్యాక్టరీ నిర్మిస్తున్నాను. దాని విషయమై కొంత పనికోసం అమెరికా వెళ్తున్నాను... చూసి పోదామని వచ్చాను.. "అన్నాడు నవ్వుతూ.

ఓరి పిడుగా? అన్నారు, నలుగురూ: ముగ్గురు అన్నలూ అతని చుట్టూ చేరారు. ఏవిటే...ఇన్నాళ్లూ దొంగతనంమీదనే... ఆధారపడ్డావా...ఆ చరిత్ర అంతా మాకు చెప్పవా ఏవిటి?. అన్నారు.

"ఆ విషయాలు తరువాత చెప్తాను. మీరు ఈ ఊరు వదలివెయ్యండి నేను బొంబాయిలో పెద్ద మేడ ఒకటి కొన్నాను. మీరంతా రేపే విమానంలో వెళ్లి అక్కడ ఉండచ్చు. తర్వాత అన్నిసంగతులూ మాట్లాడుకోవచ్చును. ముందర ఇల్లు ఖాళీచేసి సామానుసర్దే ఏర్పాటు చెయ్యండి...నాన్నకు ఆరోగ్యంకూడా కుదుటపడ్తుంది. అక్కడ పెద్దపెద్ద వైద్యులు కూడా ఉన్నారు -" అన్నాడు.

తన అన్నలకు అసలు మాట్లాడేందుకే అవకాశం ఇవ్వలేదు. ఇంతలో తండ్రి అందుకొని - "ఒరే అబ్బాయ్, అంత తొందర ఏవిటిరా? అన్ని విషయాలూ నిదానంగా మాట్లాడుకుందాం నాలుగురోజులు ఆగేపోవచ్చు.. నీచరిత్ర కొంచెం మాకు విన్పించు...ఆమాత్రం భాగ్యం మాకు లేదా?" అన్నాడు.

"దొంగతనమంటే...కేవలం దొంగతనంమీద ఇన్నాళ్లూ ఆధారపడలేదు...మొదట్లో దొంగతనం చేశాను. కొన్ని సంవత్సరాలు ప్రపంచంలో నిజాయితీకి, న్యాయానికి, సత్యానికి కాలం కాదని, అంతా బూటకం, మోసం చేసే వాళ్లకే రోజు లనీ గ్రహించాను. అందువలన తరువాత ఆ పంథాలోనే జీవితంగడిపాను...... రోజులు గడుస్తున్నకొద్దీ జీవితంలోని అసలు రహస్యం తెలిసిపోయింది—నమ్మించి మోసం చేయటం ఎంత సులభమో నాకు అర్థమయ్యింది...ఒక పెద్ద పెట్టుబడి గల కంపెనీలో చేరికొన్నాళ్లున్న తరువాత...కంపెనీ యజమాని భార్యకూ నాకూ కొంత పరిచయం ఏర్పడి అదే ప్రణయంగా మారి...మేం ఇద్దరం కలసి దేశాంతరం వచ్చేశాం. (ఆమె బోలెడంత డబ్బుతో వచ్చేసింది) ఆ తర్వాత రత్నాలవ్యాపారం సాగించాం...దాంట్లో వచ్చిన లాభం అంతా, ఇంతా కాదు......ఆ తర్వాత మాయచేసి ఆ వ్యాపారంఅంతా చాల ఎక్కువ విలువకు ఇంకొరికి అమ్మి...ఆ డబ్బుతో మరో పరిశ్రమ

(16-వ పేజీ చూడుడు)

వరం వస్తే సరా?

(14 వ పేజీ తరువాయి)

ఏడుస్తావు? నిన్నెవరైనా ఏమన్నా అన్నారా తల్లీ?' అని బుజ్జగిస్తూ— 'అలా అందమైన ఆ రోజా పూలు చూసి' అని అన్నాడు సమాధాన పరచాలని.

'ఛీ! ఆ రోజాపూలు అందంగా ఉన్నాయా? నాన్నా, నిజంగా నీవు వాటిని నాశనం చేశావు! వాటి అందమంతా చెరిపేశావు. ముందటి వన్నె—వాసి, వాసనా, వాటికే దీటైన మార్దవం మాయమైంది; కఠినంగా తయారైంది' అని యేడుస్తూ చెప్పింది.

ఎన్నో బంగారమయినందుకు సంతోషిస్తున్నాడే గాని ఆ అమ్మాయి లేత మనస్సును ఎంతగా నొప్పించాడో తెలుసుకోలేక పోయాడు— ఆ ఉబ్బులో మన రాజు— తరాజు!

ఎలాగో ఓలాగు ఆ అమ్మాయిని ఓదార్చి భోజనానికి కూర్చున్నాడు ఆకలికి అంటుకుంటిస్తూ. త్రాగుదామని తాకే సరికల్లా ప్రతివస్తువూ బంగారంగా మారింది. పాలు కరిగిన బంగారంలా ఐంది. తన నోట మట్టే! ఇక నేం చేస్తాడు? ఏం తిని జీవిస్తాడు? ఆకలితో చావాల్సిందేనా? దిగులు పట్టుకొంది.

అంతలోనే ఒక మంచి ఊహ తట్టింది: 'ఒక పదార్థం తీసికొని, వెంటనే— బంగారంగా మారేలోపుగానే— గబుక్కున నోట్లో వేసుకుని, గుటుక్కున మింగేస్తే సరిపోతుంది?' అనుకొన్నాడు.

వేడిగా వుండే ఒక రొట్టెముక్క తీసి చటుక్కున అంగిట్లో వేసికున్నాడు; అది బంగారం అయింది. వేడిగా ఉంది గదా? అటు కడుపులోకీ పోకుండా, ఇటు కక్కడానికీ వీలు గాక, గొంతులో ఇరుక్కుని గొంతంతా కాల్చేసింది. బాధ కోర్వలేక నెత్తీ, నోరూ, మొత్తుకున్నాడు. విలా విలా తన్నుకున్నాడు.

మళ్లీ మంచి ఉపాయం ఆలోచించాడు: 'తాను తాకకుండానే తన కూతురిచేత నేరుగా గొంతులో పాలైగా పోయించుకోవచ్చు' అనుకుని, అనుకున్నట్టు చేశాడు. అదీ అతని ప్రాణానికే వచ్చింది. అతని దేహస్పర్శ తగిలేప్పటికి పాలు కరిగిన బంగారం అయింది. మరింత బాధ పడ్డాడు.

ఓ పక్క ఆకలి దహించుకు పోతోంది; ఇంకో ప్రక్క తాను కోరి తెచ్చుకున్న వరం తన ఉసురుకే మోసం తెచ్చేలా తయారైంది. పాపం! అతని స్థితి ఎలా వుండాలో ఆలోచించండి. ఏదీ సాధ్యంగాక ఇక ఏడుపు సాగించాడు.

అతన్ని సమాధానపరచడానికి పసిడి బొమ్మ దగ్గరగా వచ్చింది. వాళ్లు తెలియని దుఃఖంలో బాధలో, ఆ అమ్మాయిని రెండు చేతులా దగ్గరకు లాక్కొని ముద్దు పెట్టుకొన్నాడు పాపం— వాత్సల్యంతో.

ఇంకేముంది? కొంప మునిగింది! అమ్మాయి నిజంగా బంగరు బొమ్మే అయింది. నోట మాట లేదు. గుండె కొట్టుకోవటం ఆగిపోయింది. చైతన్యం శూన్యం. కదలలేదు. బొమ్మ!

తాను చచ్చేస్థితిలో తన కూతుర్ని పోగొట్టుకొన్నాడు. ఇప్పుడెంత ఏడిస్తే ఏం లాభం? పశ్చాత్తాపం పడితే ఏం ఉపయోగం? 'చేయి కాలినతర్వాత ఆకులు పట్టుకున్నట్లే' అవుతుంది. తన వరమే— ఆశతో కోరుకున్నది— ఇంతటి దీన స్థితిని తెచ్చిపెట్టింది.

తాను బతకగలడా? తన ప్రాణాని కంటే మిన్న ఐన తన కూతురు మళ్లీ ప్రాణం పోసుకుంటుందా?— ఈ విచారంతో మిటికి, మంటికీ ఏకధారగా ఏడుస్తున్నాడు— తన హృదయమే కరిగి కన్నీరైనట్లు.

లోలుపుడు పడే పడరాని పాట్లు చూచి మనస్సు కరిగి కనికరం, కలిగింది కాబోలు— ముందు వరం ఇచ్చిన దేవుడు మళ్లీ అతని యెదుట ప్రత్యక్షమయ్యాడు.

'లోలుపా, క్షేమంగా వున్నావా? ఇప్పటికన్నా నీవరం నిన్ను తృప్తిపరచ గలిగిందా?' అని అడిగాడు.

ఆ మాటలు వినేటప్పటికి లోలుపుడికి 'ఉరిసిన పుండుమీద ఉప్పు పెట్టిన' ట్లయింది. కాని కొంత ఊరట మాత్రం కలిగింది లోలోపల. ఆ దివ్య పురుషుణ్ణి చూచేటప్పటికి, అతడి దుఃఖమంతా కట్ట తెగిన ప్రవాహంలా ఒక్కసారిగా పొంగి పొర్లింది. 'దేవా, క్షేమమెక్కడి క్షేమం? సర్వనాశనమై పోయాను!...' ఇక మాట్లాడలేక పోయాడు. గొంతు బొంగురు పోయింది. దేవుడి పాదాల మీద పడిపోయాడు.

కొంచెం సేపటికి తెప్పరిల్లుకుని 'దేవా, జ్ఞానం కలిగింది. ఇక నెప్పుడూ అనువు కాని దానికంటా ఆశపడను. నాకీ వరమొద్దు. దీన్ని నువ్వే తీసుకుని నా కొక గ్లాసెడు మంచినీళ్లు ఇయ్యి. ప్రాణం నిలబెట్టుకుంటాను' అని ప్రార్థించాడు.

ఆ వెలుగు వ్యక్తి— 'అలాగైతే నీవు నిజంగా ఆ వరపు పిడికిటిలోంచి తప్పించుకోవాలని తల్లడిల్లుతున్నావా? అలాగో, ఆ కనబడుతూన్న 'ఆశా పాశచ్ఛేదిని' అనే నది నుండి నీళ్లు తెచ్చి, బంగారంగా మారిన వస్తువులన్నిటి మీదా చిలకరించు. అన్నీ పూర్వపు స్థితిని పొందుతాయి. నీకు మేలగుగాక!' అని అంటూ అదృశ్యుడైనాడు.

మన రాజుగారు, వెంటనే, ఎక్కడా ఆగకుండా ఓ పరుగు దీశాడు ఆ ఏటికి. ఒక బిందెడు నీళ్లు తెచ్చాడు. మొట్టమొదట తన ముద్దుకూతురుమీద చల్లాడు. ఆ బొమ్మ మనిషైంది. కారణమేమో తెలియదు కాని ఆమె తల వెంట్రుకలుమాత్రం మునుపటిమల్లే తుమ్మెద రెక్కలల్లే మెరిసే నల్లదనాన్ని పొందలేక పోయాయి. బంగారు తీగలల్లే ఉన్నాయి. ఇది ఆమె సహజ సౌందర్యాన్ని పాడుచేయలేదు. పైగా మించిన వన్నె నే తెచ్చి పెట్టాయి ఆమెకు ఆ బంగరుకురులు. కాని, ఆమెకు చాల చిరాకేసింది, తన బట్టలన్నీ తడిసి పాడైనందుకు. తర్వాత జరిగిన కథంతా విని తెలుసుకుని శాంతించింది. తోటలోకి పరుగెత్తి పూల మొక్కలన్నిటిమీదా నది నీళ్లు చిలకరించాడు. అన్నీ మామూలు స్థితి కొచ్చాయి. ఆ పూలన్నీ ఇనుమడించిన అపూర్వ పరిమళాన్ని నలుమూలలా వ్యాపింప జేశాయి— తమ సహజస్వరూపం తమ కొచ్చిన సంతోషంతో కాబోలు!

తారుమారైన పరిస్థితులన్నీ చక్కబడ్డాయి. లోలుపుడిప్పటికి కుదుట పట్టాడు. అదిమొదలు బుద్ధి గలిగి మంచివాడుగా ప్రవర్తించ సాగాడు.

తండ్రీ - కొడుకులు

(11-వ పేజీ తరవాయి)

స్థాపించాం.. షేర్లవల్ల విపరీతమైన పెట్టుబడి వచ్చింది. డబ్బు బాగా వచ్చినతరువాత... కొన్నాళ్లకు! కంపెనీ దివాలా అని...అనేటప్పటికి...అంతా తలక్రిందైంది...ఒక టేమిటి ఇలాటివి ఎన్నో చేశాను. నాకు చేతనయినంత వరకూ మోసంచేస్తూనే రోజులు గడుపుతూ వచ్చాను. ఈమధ్య నాలుగుసంవత్సరాలనుండీ నేనంటే ఓవిధమైన గౌరవం ఏర్పడ్డది ప్రజలకు. ఆతర్వాత ప్రజోపకారమైన పనులు చాలా చేశాను. దాంతో ఖ్యాతి ద్విగుణీకృతమయింది. ఏం చెప్పను? అన్నీ ఎందుకు...ప్రస్తుతం నా పని బాగానే ఉంది. నేను అమెరికా వెళ్తున్నాను. ఆరునెలల్లో తిరిగివస్తాను. అక్కడనుంచి ఇంగ్లండుకూడ బహుశా వెళ్తానేమో!—" అంటూ అన్నవైపు తిరిగి "మీ ప్లీడరీ...... ఏమయింది? డాక్టరి ఏమయింది? ఇంకా ఎంత ఉన్నతస్థితిలో ఉన్నారో అనుకున్నాను" అన్నాడు.

"నాసంగతి చెప్పటానికి నాకే సిగ్గుగా ఉంది. ప్లీడరీలో ప్రవేశించాను. ప్రాక్టీసు వచ్చిన కొత్తల్లో నా దురదృష్టవశాత్తూ నేను తీసికొన్న కేసులు అరడజనూ కూడా నెగ్గలేదు. ఇంక ఏ ప్లీడరు అవి తీసికొన్నప్పటికీ నెగ్గేవి కావు. అలాంటివి తీసికొన్నాను. దాంతో నా పలుకుబడి తగ్గిపోయింది. ఒక్క కేసు రాలేదు...... దమ్మిడీకూడా రాలేదు. నా మనస్సు సరిలేక తిరుగుతూంటే నన్ను పిచ్చివాడు అన్నారు. అంతకన్న దురదృష్ట మేముంది? డాక్టరై వాడు కొన్నాళ్లు వెలగబెట్టాడు. నయంకాని కేసులు వాడి దగ్గరకు వచ్చినయి. వాడేం చేస్తాడు పాపం, అయిదారు రోగులు చచ్చిపోయినారు. దాంతో అందర్నీ చంపుతాడు అని పేరుపడిపోయింది. కొన్నాళ్లయిన తరువాత పిల్లలు రాళ్లు కూడా వేశారు. ఏం చేస్తాడు పాపం...మూడోవాడు వ్యాపారం వెలగబెట్టాడు...మొదల్లో ంచీ నష్టమే...అయినా ఇంకా చేశాడు...వాడు పెట్టిన కంపెనీలన్నీ ధభాల్న మునిగిపోయి...ఆ నష్టాన్ని పూడ్చటానికి ఎంత ఆస్తిఅయినా చాలలేదు. ఆస్తిఅంతా పోయింది. దానివల్ల నాన్న ఆస్తికూడా చాలవరకు దెబ్బతిన్నది. నాన్నకు సంబంధించిన కొన్ని బ్యాంకులు కూడా మునిగిపోయినయి. చాల అన్యాయం జరిగింది...... జీవనం గడపటమే ఇప్పుడిప్పుడు కష్టంగా ఉంది..." అని దీనంగా ముగించాడు.

"కేవలం తెలివితేటలే కాదు, అదృష్టంకూడా ఉండాలి..అయినా జీవితం ఓ విచిత్రమైనది... ఏం చెప్పను? న్యాయానికి కాలం లేదు...లేకపోతే మన విధి అనుకుంటాం" అన్నాడు మూడోవాడు......

—"అన్నిటికీ ఆ భగవంతుడే! ఆయన లీలలే!" అన్నాడు తండ్రి దగ్గుతూ.

[ఒక పోర్చుగీసు కథను ఆధారంగా]

తెనాలిలో జరిగిన గుంటూరుజిల్లా మహిళామహాసభ సందర్భంలో తీయబడిన ఛాయాచిత్రము. అధ్యక్షురాలు శ్రీమతి వడ్లమూడి అన్నపూర్ణాదేవి, సభాప్రారంభకురాలు శ్రీమతి కొత్తపల్లి శ్రీకాంతమ్మ, సాధువమ్మ, శ్రీమతి కొల్లా కనకవల్లి తాయారమ్మగార్లు మధ్యగలరు.